# కేటీఆర్ సభకు విస్తృత ఏర్పాట్లు

- రూ.180 కోట్లతో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- దాదాపు 50 వేల మందితో భారీ బహిరంగ సభ
- సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి





సభాస్థలిని పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్, ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 3 : వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో గురువారం మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో జరుగుతున్న సభా పనులను ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.96 కోట్లు మంజూరు కావడంతో, వికారాబాద్‌లో రైల్వే బ్రిడ్జి వద్ద పనులను కేటీఆర్ ప్రారంభించేందుకు స్థలాన్ని సందర్శించారు. గిరిజన భవన నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. పనులు పకడ్బందీగా, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ గురువారం వికారాబాద్‌లో రూ.180 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. సభకు జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, రానున్నట్లు.. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్దఎత్తున హాజరు కావాలన్నారు. దాదాపు 50 వేల మంది హాజరవనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు గయాజ్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజమల్లు, గఫర్, షఫీ ఉన్నారు.

# తెలంగాణలో గ్రామాల అభివృద్ధి భేష్..

- రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ జాతీయ సలహాదారు హిమాన్షుమిశ్రా
- కడ్తాల్‌లో అభివృద్ధి పనుల పరిశీలన
- సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డికి కితాబు

కడ్తాల్, అక్టోబర్ 3 : తెలంగాణలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు భేష్‌గా ఉన్నాయని రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ జాతీయ సలహాదారుడు హిమాన్షుమిశ్రా అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ గ్రామాన్ని డివిజన్ పంచాయతీ అధికారి అమృత, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన రైతు వేదిక, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణ తీరు, ప్రభుత్వ పాఠశాలలు, ఇంకుడు గుంతలు, మహిళా స్వయం సహాయక సంఘాల వారు నిర్వహిస్తున్న వ్యాపారాలను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డిని అడిగి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సహకారం ఎలా ఉంది, నిధులు ఏ విధంగా కేటాయించడం జరుగుతుంది, గ్రామపంచాయతీలు సొంత నిధుల సమీకరణ ఎలా చేస్తారు.. తదితర విషయాలపై ఆయన ఆరా తీశారు.

### గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అభివృద్ధిలో తెలంగాణలోని గ్రామాలు ముందు వరుసలో ఉన్నాయని మిశ్రా తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ), స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) ఛేదనలో గ్రామపంచాయతీ తీరు ఆదర్శంగా ఉన్నదని కితాబునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం తెలంగాణకు మణిహారంగా మారిందన్నారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పనితీరును ఆయన ప్రశంసించారు. గ్రామపంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను సమగ్ర రూపకల్పన చేసి కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖకు అందజేస్తానని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ లాయక్‌అలీ, వార్డు సభ్యులు భిక్షపతి, గణేశ్‌గౌడ్, నాయకులు అశోక్, రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఈజీఎస్ ఎఫ్‌ఏ వెంకటేశ్, మహిళా సంఘాల సభ్యులు సీసీ వసంత, వీవోఏలు వనిత, శైలజ పాల్గొన్నారు.



కడ్తాల్‌లో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న హిమాన్షుమిశ్రా

# ఆడబిడ్డలు మెచ్చేలా.. నచ్చేలా..

- రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు
- జిల్లాలో 2.75 లక్షల మంది అర్హులైన మహిళలు
- ఇప్పటివరకు జిల్లాకు చేరుకున్న చీరలు 1.62 లక్షలు
- ఆయా మండలాలకు తరలించిన జిల్లా యంత్రాంగం
- ఒకట్రెండు రోజుల్లో పంపిణీకి ఏర్పాట్లు
- సిరిసిల్ల, పోచంపల్లి నుంచి జిల్లాకు సరఫరా
- ఈ ఏడాది 25 వెరైటీల్లో నాణ్యమైన బతుకమ్మ చీరలు రెడీ
- ప్రతీ ఏటా బతుకమ్మ చీరలకై రూ.కోట్లలో ఖర్చు చేస్తున్న సర్కారు

వికారాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : బతుకమ్మ పండుగ వచ్చిందంటే చాలు ఆడబిడ్డలు సంతోషంగా పుట్టింటికి చేరుకుంటారు. పండుగకు వచ్చే ఆడబిడ్డలకు చీరలను పెట్టడం సాంప్రదాయంగా వస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని ఆడబిడ్డలను సొంత బిడ్డల్లా భావిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతీ బతుకమ్మ పండుగకు కానుకగా చీరలను పంపిణీ చేస్తూ వస్తున్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతీ ఆడబిడ్డకు బతుకమ్మ చీరలను అందజేస్తున్నారు. ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు లేదా ఇతర ఏదేని గుర్తింపు కార్డులను చూపించినట్లయితే చీరలను అందజేస్తారు. ప్రతీ ఏటా చీరల పంపిణీకిగాను రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నది. నాణ్యతతో కూడిన బతుకమ్మ చీరలను ఆడబిడ్డలకు అందజేసేందుకు అంతా సిద్ధం చేశారు. చీరల పంపిణీకి మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోలు., గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఏ, రేషన్ డీలర్లు., మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్లు, రేషన్ డీలర్లతో కమిటీలు ఏర్పాటు చేసి వీరి ఆధ్వర్యంలో చీరలను అందజేయనున్నారు. చేనేత కార్మికుల ఆధ్వర్యంలోనే చీరల తయారీ జరుగుతుండడంతో వేల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి.

### మండలాలకు బతుకమ్మ చీరలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏటా అందిస్తున్న పండుగ కానుక బతుకమ్మ చీరలు వారం రోజుల క్రితమే జిల్లాకు చేరుకున్నాయి. జిల్లాకు పోచంపల్లి, సిరిసిల్ల ప్రాంతాల్లో తయారు చేసిన బతుకమ్మ చీరలు వచ్చాయి. జిల్లాలో అర్హులైన మహిళలు 3,37,586 మంది ఉండగా, ప్రతీ ఏటా బతుకమ్మ చీరలను తీసుకుంటున్న ప్రకారం జిల్లాలో అర్హులైనవారు 2.73 లక్షల మంది ఉన్నట్లు జిల్లా యంత్రాంగం గుర్తించి, ఈమేరకు సరిపోను బతుకమ్మ చీరలను పంపించేలా ప్రభుత్వానికి నివేదించింది. ఇప్పటివరకు 1,62,145 చీరలు జిల్లాకు చేరుకోగా, మిగతా చీరలు ఒకట్రెండు రోజుల్లో రానున్నాయి. ఇప్పటికే బతుకమ్మ చీరలను వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం నుంచి ఆయా మండలాలకు మంగళవారం తరలించారు. జిల్లాలో 2.73 లక్షల మంది అర్హులైన లబ్ధిదారులుండగా 1,62,145 బతుకమ్మ చీరలు జిల్లాలోని ఆయా మండలాలకు చేరాయి.





గోడౌన్ల నుంచి తరలించేందుకు సిద్ధంగా ఉన్న చీరలు

**మండలాలు, మున్సిపాలిటీలవారీగా పంపిణీ చేయనున్న చీరలు**

| మండలం/ మున్సిపాలిటీ | చీరలు | మండలం/ మున్సిపాలిటీ | చీరలు |
|---|---|---|---|
| నవాబుపేట్ | 12,379 | కోట్‌పల్లి | 6,871 |
| బంట్వారం | 6304 | కులకచర్ల | 16,615 |
| బషీరాబాద్ | 12,936 | మర్పల్లి | 15,315 |
| బొంరాస్‌పేట్ | 17,496 | మోమిన్‌పేట్ | 12,519 |
| ధారూరు | 12,080 | నవాబుపేట్ | 12,379 |
| దోమ | 14,378 | పరిగి(మ) | 12,884 |
| దౌల్తాబాద్ | 15,068 | పరిగి(ము) | 4,360 |
| కొడంగల్(మ) | 11,434 | పెద్దేముల్ | 13,970 |
| కొడంగల్(ము) | 3,591 | పూడూరు | 13,130 |
| | | తాండూరు(మ) | 15,222 |
| | | తాండూరు(ము) | 18,453 |
| | | వికారాబాద్(మ) | 8283 |
| | | వికారాబాద్(ము) | 15,660 |
| | | యాలాల | 14,043 |

నేడు లేదా రేపు సర్కారు అధికారికంగా అందజేయనున్నది. తదనంతరం జిల్లాలో చీరలు అందజేసేలా ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 588 రేషన్ దుకాణాల ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది సరికొత్త డిజైన్లు, రంగులతో చేనేత కార్మికులు చీరలను తయారు చేశారు. బతుకమ్మ చీరలకు సంబంధించి 200 రంగులు, 25 డిజైన్లు., యువతులు, మహిళల కోసం 6.3 సెం.మీ, వృద్ధుల కోసం 9 మీటర్ల చీరలను సిద్ధం చేశారు. ప్రతీ చీరతోపాటు 80 సెం.మీ జాకెట్ పీస్ కూడా అందించనున్నారు.

# 5న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

**జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్**



వికారాబాద్, అక్టోబర్ 3 : వికారాబాద్ జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 5న ఉదయం 10:30 గంటలకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్), తెలంగాణ ప్రభుత్వం కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద ఒక రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ తెలంగాణ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన, సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశీ ప్లేస్‌మెంట్‌ను సులభతరం చేయడానికి కృషి చేస్తున్నాయని తెలిపారు. టామ్ కామ్ గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రొమేనియా, యూకే వంటి వివిధ దేశాలలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు నమోదిత ఏజెన్సీలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో నైపుణ్యం కలిగిన నర్సులు, కార్మికులకు అధిక డిమాండ్ ఉందని, ఈ ఉద్యోగాలు ఆకర్షణీయమైన జీతం, ప్యాకేజీలు కలిగి ఉంటాయన్నారు. అభ్యర్థులకు రిక్రూట్‌మెంట్ ప్రక్రియను సురక్షితమైన, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా సులభతరం చేయడంలో టామ్‌కామ్ సహాయం చేస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు అప్‌డేట్ చేసిన రెజ్యూమ్, సంబంధిత డాక్యుమెంట్‌లతో పాటు డ్రైవ్‌కు హాజరు కావాల్సిందిగా తెలిపారు. మరిన్ని వివరాలకు www.tomcom.telangana.gov.inను సందర్శించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7893566493, 9849639539లను సంప్రదించాలన్నారు.

# దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్**



వికారాబాద్, అక్టోబర్ 3 : వికారాబాద్ జిల్లా తాండూరులోని రాష్ట్రీయ బాల స్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమం ప్రోగ్రాం కింద కొత్తగా ఏర్పాటు చేయబడిన, డీఈఐసీలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఈ నెల 4న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అప్లికేషన్ ఫారాన్ని జిల్లా అధికారిక వెబ్‌సైట్ vikarabad.telangana.gov.inలో పొందుపర్చినట్లు తెలిపారు. పిడియాట్రీషియన్, సైకాలజిస్ట్, అపోమెట్రిస్ట్, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్ కం.స్పెషల్ ఎడ్యుకేటర్, డెంటల్ టెక్నీషియన్ తదితర పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.